# ఎవరికి తగిలిందీ గాయం ?

రాజధాని ఎక్స్‌ప్రెస్ గాలిని చీల్చుకుని శరవేగంతో ముందుకు దూసుకుపోతోంది. అందులో కూర్చున్న సారధి మనసు కళ్లెం లేని గుఱ్ఱంలా పరుగులు తీస్తోంది. తేడా అల్లా రైలు ముందుకు పరుగెడుతుంటే సారధి మనసులోని ఆలోచనలు వెనక్కి పరుగులెట్టి పాత జ్ఞాపకాలని తవ్వి కెలుకుతున్నాయి.

జరిగిన సంఘటన మధురమైనదయితే ఆనందంతో మనసు ఉరకలువేసి ఎప్పుడెప్పుడు గమ్యం చేరతానా! అని తహతహలాడేది.

కానీ దురదృష్టవశాత్తూ బాధాకరమైనది కావడంతో రైలు ముందుకు నడుస్తున్నకొద్దీ మనసు బరువెక్కసాగింది సారధికి.

భార్గవ్, పూజల పెళ్లి నా చేతులమీదుగానే జరిపించాను. ఇటు, అటు పెద్దలు ఈ పెళ్లికి ఎట్టి పరిస్థితులలోనూ ఒప్పుకోలేదు. కారణం - జాతి మతాలు వేరన్న పట్టింపే. కాలేజీలో చదువుకుంటున్నప్పటి నుంచి భార్గవ్ పూజ పట్ల పెంచుకున్న అభిమానం ప్రేమగా మారింది.

ఆమె హాస్టల్లో వుండేది. సాయంకాలాలు నేనూ, భార్గవ్ పూజ హాస్టల్‌కి వెళ్లి సరదాగా ఏ హోటల్‌కో, షికారుకో వెళ్తూ వుండేవాళ్లం.

ఇద్దరికీ సన్నిహితుడిని, ప్రాణమిత్రుడిని అయిన నాతో పూజ "భయ్యా!" అంటూ అన్నీ చెప్పేది. భార్గవ్ కూడా తన మనసులో వున్నది దాచుకోకుండా "ఒరేయ్ సారధీ!" అంటూ అన్ని చెప్పుకునేవాడు. వయసులో వారికంటే ఎక్కువ పెద్ద కాకపోయినా వారిద్దరి బాధ్యతా నాదే - అన్న భావం నాలో రోజురోజుకీ బలపడసాగింది.

ఇద్దరి చదువులూ అయి ఉద్యోగాలొచ్చి సెటిలయ్యారు. పూజ, భార్గవ్‌లు తమతమ తల్లిదండ్రుల దగ్గరకెళ్లి వారి వివాహ ప్రసక్తి తీసుకొచ్చినప్పుడు ఇరుపక్కల వాళ్లూ మండిపడ్డారట.

పూజ తల్లిదండ్రులతో వున్న కొద్ది పరిచయాన్ని పురస్కరించుకుని వాళ్లింటికెళ్లి నచ్చ చెప్ప బోయిన నాకు కూడా నాలుగు చీవాట్లు తగిలాయి. వాటికి సిద్ధపడిన నేను వారి మాటలకి బాధపళ్లేదు.

పూజ, భార్గవుల అనుబంధం, ఆప్యాయతా చూస్తుంటే ఆనాటి లైలా మజ్నూలు గుర్తుకు రాసాగారు. కానీ వీరి జీవితం మాత్రం సుఖవంతం కావాలన్న పట్టుదల నాలో పెరగసాగింది.

చాలా కాలం తల్లిదండ్రుల్ని ధిక్కరించకుండా ఒప్పించి వివాహం చేసుకోవాలన్న వారి ప్రయత్నం విఫలంకాగా, ఇద్దరూ వచ్చి నా సలహా అడిగారు. నేను వారిని రిజిస్టర్డు మేరేజ్ చేసుకోమని సలహా ఇవ్వడమే కాక ఆ ప్రయత్నాలు చేసి పెద్దగా నిల్చి ఆ పెళ్లి జరిపించి కాపురం పెట్టించాను.

పెళ్లి జరిపించాకా వారిచేత కాపురం పెట్టించే ముందు వారివారి తల్లిధండ్రుల దగ్గరకి తీసుకెళ్లి పెద్దల దీవెనలందుకోడం ధర్మం, మంచిది అనిపించింది. పెళ్లికి ముందు తిరస్కరించిన తల్లిదండ్రులు పెళ్లయిపోయి వెళ్లేకా-

ఏలాగా పెళ్లయిపోయింది కదా! మన పిల్లలుకారా? అన్న భావంతో ఆదరించిన వారనేక మంది వున్నారు. ఆ కోవలోకి చెందేవారే అయితే వీరినీ వీరి తల్లిదండ్రులు ఆదరించి ఆహ్వానిస్తారన్న ఆశాభావంతో ముందుగా భార్గవ్ తల్లిదండ్రులింటికి దంపతుల్ని తీసుకెళ్లాను.

గేటు బయటే మమ్మల్ని చూసిన భార్గవ్ తల్లిదండ్రులు గేటులోనికి కూడా రానివ్వకుండా బయటే నిలబెట్టి నోటి కొచ్చిన తిట్లు, శాపనార్థాలతో కొడుకుని కోడల్ని దీవించారు.

'ఈ ఇంట నువ్వు పుట్టనేలేదు' పొమ్మన్నాడు తండ్రి. తల్లీ అక్క చెల్లెళ్లు కూడా ఏడుపులూ, పెడబొబ్బలతో వారిని నానా మాటలూ ఆడి మళ్లీ ఈ గడప తొక్కొద్దని ఏకకంఠంతో చెప్పి లోపలికెళ్లి తలుపులేసుకున్నారు.

ఇక చేసేదిలేక, తెలిసి వారిని తీసుకెళ్లి మాటలనిపించినందుకు నేను బాధపడుతూ వారి భుజాల మీద చేతులేసి మౌనంగా వచ్చిన టేక్సీలోనే ఎక్కి కూర్చుని, అవమానంతో తలలొరిగిపోయిన వారిని ఎలా ఊరడించాలో తెలీక "భార్గవ్! మనం ఇంటికి వెళ్లిపోదాంరా" అన్నదానికి పూజా, భార్గవులు తలెత్తి నావైపు చూసి "నీ ఇష్టం" అన్నారు.

అన్నీ తెలిసి భార్గవ్ తల్లిదండ్రులింటికి తీసుకెళ్లి వాళ్లచేత కొత్త దంపతుల్ని మాటలనిపించినందుకు బాధపడుతున్న నాకింక పూజ పుట్టింటికి

తీసుకెళ్లి అక్కడకూడా వారిచేత మరిన్ని మాటలు అనిపించడం ఇష్టంలేక పోయింది.

అందుకే వారిని మా ఇంటికి తీసుకెళ్లి ఆ రాత్రి మా ఇంట్లోనే మంచి విందు ఏర్పాటుచేశాను.

ప్రేమ వివాహాలు చాలామటుకు విఫలమవుతాయన్న మాటల్ని అబద్ధంచేసి వారిద్దరూ ఎంతో అన్యోన్యంగా కాపురం చేసుకుంటుంటే చూడముచ్చటగా వుండేది. ఒకరికోసం మరొకరు పుట్టినట్లు, చిలకా గోరువంకల్లా ప్రపంచమంతా వారిదే అన్నట్లు, ఆనందమంతా తమదే అన్నట్లు వారు మసులుతుంటే ఎంతో సంతోషంగా వుండేది.

భార్గవ్ పూజని క్షణం సేపు వదిలి వుండలేకపోయేవాడు. అదృష్టవశాత్తూ ఒకే కాలేజీలో ఇద్దరికీ ఉద్యోగాలు కావడంతో కలిసి వెళ్లి కలిసి వచ్చేవారు. ఇంటికొచ్చాకా నా పనీ, నీ పనీ అనుకోకుండా ఆ జంట కలిసి అన్ని పన్లూ చేసుకునేది.

బైటకెళ్లాలంటే ఇద్దరూ స్కూటర్ మీద ఒకరి నొకరు అతుక్కుపోయి కూర్చుని వెళ్లేవారు.

నేను తరుచూ వాళ్లింటికెళ్లి వాళ్ల క్షేమ సమాచారాలడిగి వచ్చే వాడిని. వారి చిన్న ప్రపంచంలో వారికి నేనొక్కడినే ఆత్మీయుడిని.

ఇద్దరూ గిల్లికజ్జాలాడుకుంటూ "చూడు భయ్యా!" అంటూ పూజ భర్త మీద నేరాలు చెప్తుంటే, కవ్వించి ఏడిపించేవాడు భార్గవ్. వారి అన్యోన్యం అనురాగం చూస్తుంటే దేముడీ జంటని కలకాలం అలా వుంచాలని మనసులోనే కోరుకునేవాడిని.

కొంతకాలం గడిచిన తరువాత పూజా పుట్టింటి నుంచి తమ్ముడు చెల్లెలు వచ్చివెళ్లేరు.

తరవాత నెమ్మదిగా పూజా తల్లిదండ్రులు కూడా రావడం, పూజాని తీసుకెళ్లడం నాకు చెప్ప లేని ఆనందాన్ని కలిగించింది.

'అలా వారంతట వారుగా పిల్లమీద ప్రేమతో రావడమే మంచిది. ఎప్పటికన్నా భార్గవ్ తల్లిదండ్రులు కూడా ఇలాగే వచ్చి కొడుకుని కోడల్ని ఆదరిస్తే బాగుండును' అని అనుకున్నాను.

కానీ అలాంటిదేమీ కనపడలేదు. వెళ్లినప్పుడన్న మాటల్ని నిలబెట్టుకున్నట్లు వీరితో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నారు.

మొదటిసారి పూజ పుట్టింటికెళ్లినప్పుడు నేను భార్గవ్ దగ్గరకెళ్లాను. వాడు భోజనం చెయ్యకుండా చంటిపిల్లాడిలా గోల పెట్టడం చూసి నాలుగు చీవాట్లేసి వాడిచేత దగ్గరుండి అన్నం తినిపించాను.

మొదటిరోజే ఇంత డీలాపడిపోయిన - వీడు పూజ వచ్చేదాక ఎలా వుండగలడన్న భయంతో మర్నాడు కూడా వాడింటికి చూద్దామని వెళ్లేసరికి గుమ్మం దగ్గరికి పూజ ఎదురొచ్చి "భయ్యా! అక్కడ వుండలేక వచ్చేశాను. ఈయన నేనులేందే వుండలేరు భయ్యా!" అంటుంటే-

"వాడి మాటలా వుంచు. నువ్వు వుండగలిగావా వాడిని వదిలి?" అన్న నా ప్రశ్నకి సిగ్గుపడిపోతూ ముసిముసిగా నవ్వుకుంది.

మరో ఏడాదికి వారి ప్రేమపంటగా వారికి అబ్బాయి పుట్టాడు. పూజా తల్లీ, తండ్రి పురిటికి తీసుకెళ్తామంటూ వస్తే వెళ్లడానికి పూజా, పంపడానికి భార్గవ్ ఇష్టపడకపోవడంతో పూజా తల్లే వచ్చి పురుడుపోసి ఓ నెల్లాళ్లుండి వెళ్లింది.

అలా ఇటు పూజా తల్లిదండ్రులు కలిసినా అటు భార్గవ్ తరుపువాళ్లు మాత్రం వీళ్లతో సంబంధ బాంధవ్యాలని తెగతెంపులు చేసేసుకున్నారు. కనీసం మనవడిని చూడటానికి కూడా రాలేదు. అయినా ఈ దంపతులకవేం పట్టేవికావు.

ఇద్దరల్లా ముగ్గురయి మునపటికన్నా ఆనందం, అనురాగంతో కాలాన్ని మర్చిపోయి సంసార సాగరంలో పూల పడవలో పయనించసాగారు.

నేను వెళ్లినప్పుడల్లా కనీసం ఒక్కసారన్నా "భయ్యా! నీ ఆశీర్వాదమే మేమిలావుండటానికి కారణం" అని పూజా అంటే "నీ మేలు మర్చిపోలేనురా!" అంటూ అటు వాడూ ఇద్దరూ నాకు ధన్యవాదాలు చెప్తుంటే కళ్లు చమర్చేవి.

షాజహాన్ ముంతాజ్‌కి ప్రేమ కానుకగా కట్టించిన తాజ్‌మహల్‌ని మనం చూస్తున్నాం. ఆ దంపతుల్ని చూడలేదు. అలా తాజ్‌మహల్ కట్టించలేక పోయినా ఈ దంపతుల అనురాగంకూడా వారికే మాత్రం తీసిపోదనిపించేది నాకు.

ఒకనాడు ఉదయం నాకొచ్చిన ఫోన్‌కాల్ విని అదురుతున్న గుండెతో ఆసుపత్రికెళ్లాను.

ఆఫీసుకి వెళ్తున్న పూజా, భార్గవుల్ని లారీ గుద్దేసింది. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం లేకపోయినప్పటికీ ఇద్దరికీ గాయాలు తగిలాయి. అందులో వెనక కూర్చున్న పూజాకి చిన్నచిన్న దెబ్బలు తగలడంతో కట్లు కట్టి వెంటనే పంపేశారు.

భార్గవ్ కాలికి, చేతికి బలమైన గాయాలు తగలడంతో ఆసుపత్రిలో కొన్నాళ్లుండవలసి వచ్చింది. పూజా తన గాయాల్ని, నొప్పుల్ని మర్చిపోయి, భార్గవ్‌కి రాత్రనక, పగలనక చాకిరీ చేస్తూకూర్చుంటూంటే "ఒరేయ్ సారధీ! చూడరా - కాస్త దానికి చెప్పు - దానికీ దెబ్బలు తగిలాయి కానీ అది దాని గురించి పట్టించుకోవడంలేదు. దాని ఆరోగ్యం పాడయితే కష్టంకదూ? ఎవరు చేస్తారు చెప్పు?!" అంటూ వాపోయేవాడు.

భార్గవ్‌ని ఇంటికి పంపించాక కూడా తిరిగి మామూలు మనిషి అయ్యేవరకు పూజా సెలవుపెట్టి దగ్గరుండి అతనికి సపరిచర్యలు చెయ్యడం చూసిన నాకు 'దాంపత్యం అంటే ఇదీ - వీరికి వేదమంత్రాల్తవసరం లేదు. మనసులు కలిసి, అనురాగాలిచ్చి పుచ్చుకుంటూ బతకడం భార్యాభర్తలకి చాలా ముఖ్యం' అనిపించింది.

ఇంతలో నాకు ఫారిన్ ఎసైన్‌మెంట్ వచ్చి అమెరికాకి వెళ్లాను. వెళ్లాను. వెళ్లినా తరుచూ ఆ భార్యా భర్తలు రాసే ఉత్తరాలు వారి సంసార జీవనపు మధురిమల్ని తెలియజెప్పుతూనే వుండేవి.

ఉన్నట్లుండి ఆకస్మాత్తుగా వారివద్దనుంచి నాకు ఉత్తరాలు రాకపోవడంతో ఏవో చెడు ఆలోచనలే నా బుర్రలోకి రాసాగాయి. రెండు ఉత్తరాలు నేను రాసినా జవాబు రాకపోవడంతో రాత్రింపగళ్లూ వారి గురించే ఆలోచించేవాడిని.

ఒకరోజు పూజా తండ్రి వద్దనుంచి వచ్చిన ఉత్తరంలోని విషయం - రెండో కాన్పులో గుర్రపువాతం వచ్చి పూజ పోయిందన్నది నా హృదయాన్ని వెయ్యి ముక్కల్ని చేసేసింది.

కళ్లు మూసినా తెరిచినా ఆ ప్రేమజంటే నా కళ్లముందు మసులుతోంది.

నాకు తెలిసినంతలో 'ఆ దంపతులు ఒకరినొకరు వదిలి ఎప్పుడూ లేరు' అనే కంటే 'వుండలేకపోయేవారు' అనడం సమంజసమేమో! అలాంటి ఆ జంటని భగవంతుడు శాశ్వతంగా ఓ పక్షికి అందనంత దూరంగా రెండో పక్షిని విడదీసి పంపేశాడు.

పోయిన పూజ ఏలోకంలో వుండి భార్గవ్ కోసం బాధపడుతోందో తెలియదుగానీ, ఈలోకంలో వున్న భార్గవ్ ఆమె ఎడబాటుని ఎలా తట్టుకుంటున్నాడో తల్చుకుంటేనే మతిపోతోంది. దూరంగా వున్న నా మనసు పడుతున్న వేదన వర్ణనాతీతం.

రెక్కలుంటే వెళ్లి వాలేవాడిని. వూరడించాలని తల్లడిల్లిపోతున్నాను. కానీ కుదరనంత దూరంలో వుండటంతో నా బాధనంతా కాగితంమీద పెట్టి భార్గవ్‌కి రాసిన ఉత్తరానికి వాడి దగ్గరనుంచి జవాబు వచ్చింది.

అందులో ప్రతీ వాక్యం, ప్రతీ పదమూ, పూజా గురించే. చివరగా పూజాలేని తన జీవితం ఎంత నిస్సారంగా గడుస్తోందో రాస్తూ, ఆమె జ్ఞాపకంగా వదిలివెళ్లిన చిన్నారి ప్రశాంత్ కోసం తానింకా బతికి వున్నానని, బతుకుతున్నానని రాశాడు.

అతని ఉత్తరంలోని ప్రతీ వాక్యం నా హృదయాన్ని దుఃఖంతో పిండెయ్యసాగింది. ఊరడింపుగా జవాబు రాసినప్పటికీ పూజా మరణం నన్ను కూడా అంతగానూ బాధించి కృంగదియ్యసాగింది. ఆ తరవాత రాసిన రెండు మూడుత్తరాలకి భార్గవ్ వద్ద నుంచి జవాబు రాకపోయేసరికి బాధకొద్దీ రాయలేకపోతున్నాడనుకున్నాను.

ఈ సంఘటన జరిగిన నాలుగు నెలల తరవాత నేను భారతదేశానికి వచ్చేశాను.

దిగిన నాలుగు రోజులకే సామాను మావాళ్లింట్లో పడేసి, భార్గవ్‌ని చూడాలన్న తహతహతో వాడున్న ఊరికి బయలుదేరాను.

ఆ పాత జ్ఞాపకాలతోపాటు ఇప్పుడు భార్గవ్‌ని ఎలా వూరడించడం? అన్నదే నా ఆలోచన.

"నన్ను చూసి వాడు గోలగోల పెడితే నేను వూరడించగలనా? ఎలా అతని బాధని చూడగలను? అతనితో నేనూ బాధపడుతూ కూర్చుంటే అతని

పరిస్థితి ఎలాగుంటుంది?

నిజంగా పిల్లవాడు ఎంత దురదృష్టవంతుడు! నాలుగేళ్లు నిండకుండా తల్లిని పోగొట్టుకున్న దౌర్భాగ్యుడు పాపం" మనసులో అనుకుంటూ వచ్చే ఆలోచనలతో బుర్రంతా వేడెక్కుతుండగా రైలు గమ్యం చేరింది.

ఆటోదిగి వణుకుతున్న చేతుల్తో డోర్‌బెల్ నొక్కిన రెండు నిమిషాలకి భార్గవ్ వచ్చి తలుపు తీసి తలొంచుకుని నిలబడ్డాడు.

లోపలికి వెళ్లి అతని భుజం మీద చెయ్యివేసి నిలబడ్డ నాకు లోపలినుంచి పెద్దపెద్ద కేకలు, తిట్లు ఆ తరువాత ఎవరినో కొడుతున్న శబ్దంతో పాటు చిన్నపిల్లవాడి ఏడుపు వినపడగానే భార్గవ్ ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు.

ఇంతలో మాసిన బట్టలతో, తైల సంస్కారం లేని చింపిరి జుట్టుతో వున్న ఓ పిల్లాడిని రెక్కపట్టుకుని ఓ పాతికేళ్ల యువతి ఈడ్చుకుంటూ వచ్చి ఏదో అరవబోయి నన్ను చూసి పిల్లాడి జబ్బ వదిలి అక్కడే నిలబడిపోయింది కొశ్చన్‌మార్కు ముఖంతో నావైపుకి చూస్తూ.

"ఒరేయ్ సారధీ! నా భార్య సోనారా! మా పెళ్లయి నెల్లాళ్లయింది. తను మా అమ్మకి దగ్గర బంధువు" అంటూ చేసిన పరిచయానికి ఆశ్చర్యాన్నీ, నాకు తగిలిన షాక్‌ని దాచడానికి ప్రయత్నిస్తూ "నమస్తే" అని చేతులు జోడించాను.

పూజా కొడుకుని చూస్తుంటే వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ, ఇక అక్కడ నిలబడలేక పరామర్శ చేద్దామని వచ్చిన నేను "కంగ్రాచ్యులేషన్స్ రా భార్గవ్!" అన్న మాటల్ని బలవంతంగా అని చేతులు కలిపి తన్నుకొస్తున్న బాధని ఆపుకోడానికి ప్రయత్నిస్తూ బైటికొచ్చి ఆటో వాడికి పూజా తల్లిదండ్రుల ఇంటి అడ్రసు చెప్పి పదమన్నాను.

కన్నవారి కడుపులో పూజ రగిల్చిన మంటని ఉపశమన వాక్యాలతో ఊరడిద్దామని.

"బిడ్డకోసం ఏడ్చే ఆ గర్భశోకాన్ని ఊరడించగలనా?' మనసులో అనుకుంటూ ఆటో దిగిన నాకు ఆతల్లిదండ్రుల దుఃఖాన్ని ఆపడం నాశక్యం కాలేదు. అందుకే వీరిని తల్లిదండ్రులన్నారు. ప్రత్యక్ష దైవాలివి. ✻

**(జూన్ 1999 స్వాతి)**